పెచ్చులూడుతూ.. భయపెడుతూ

- శిథిలావస్థకు తహసీల్దార్ కార్యాలయాలు
- జిల్లాలో సొంత భవనాల్లేక ఇతర కార్యాలయాల్లో నిర్వహణ
- భయంభయంగా సిబ్బంది విధులు
- వచ్చేందుకు జంకుతున్న జనం
- వర్షాకాలంలో పరిస్థితి మరింత తీవ్రం



శిథిలావస్థకు చేరిన ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయం

ఖానాపూర్: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలు శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. కానీ ఆయా మండలాల్లో సొంతభవనాల కోసం అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఇతర కార్యాలయాల భవనాల్లోనే తహసీల్దార్ కార్యాలయాల నిర్వహణ సాగుతోంది. పాత మండలకేంద్రాల్లోనూ అన్ని చోట్ల పురాతన భవనాలే దర్శనమిస్తున్నాయి.

శిథిల భవనాల్లోనే విధులు..

శిథిల భవనాల్లో అధికారులు, సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దినెలల కిందట జిల్లాకేంద్రంలోని నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ భవన పైకప్పు కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడే ఉన్న పలువురికి ప్రమాదం తప్పింది.

ఖానాపూర్‌లోనూ అదే స్థితి..

ఖానాపూర్‌తోపాటు ఇతర మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల భవనాలు నేడో రేపో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గతంలో ఖానాపూర్‌లో పైకప్పులు కూలి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. వర్షాకాలంలో కార్యాలయానికి వచ్చేవారితో పాటు సిబ్బంది భయంతో వణికిపోతారు. గదులన్నీ ఊరుస్తుండడంతో పలు డాక్యుమెంట్లు తడిసిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు.

కలెక్టర్ చెప్పినా ముందుకు సాగని వైనం

జిల్లాలో మొత్తం తహసీల్దార్ కార్యాలయాలు 19 ఉన్నాయి. వాటి పాత మండలాల్లో 13 ఉండగా.. కొత్తవి ఆరు ఉన్నాయి. గతంలో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని చోట్ల కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామని.. చెప్పినా ఎక్కడా అడుగు ముందుకు పడటం లేదు.

ఆదాయం వస్తున్నా.. పట్టించుకోరు

సాధారణంగా తహసీల్దార్ కార్యాలయాలకు జనం కుప్పలుతెప్పలుగా వస్తుంటారు. దీనికితోడు ఇటీవల వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సైతం తహసీల్దార్ కార్యాలయాల్లోనే ప్రారంభించడంతో రద్దీ మరింత పెరిగిపోయింది. ప్రభుత్వం వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామాల్లో భూసమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోవడం లేదు. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా.. సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులైనా చొరవ తీసుకుని నూతన భవనాలు నిర్మాణం అయ్యేలా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో పలు తహసీల్దార్ కార్యాలయాల వివరాలు

- కడెంలో శిథిలావస్థలో ఉన్న పాత పీహెచ్‌సీ భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. వర్షాకాలంలో ఈ భవనం పూర్తిగా ఉరుస్తుంది.
- నూతన మండలమైన పెంబిలో రెండు నెలల కిందటి కూల్చివేయాల్సిన పురాతన పీహెచ్‌సీ క్వార్టర్‌లో కొనసాగించారు. రెండు నెలలుగా మండల విద్యావనరుల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు.
- నర్సాపూర్(జీ)లో పాత పీహెచ్‌సీ భవనంలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.
- కుభీర్‌లో పాత బీసీ హాస్టల్ భవనంలో కార్యాలయం కొనసాగుతుంది.
- బైంసాలోనూ సొంత భవనం లేక ఆర్‌అండ్‌బీ భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు.
- మామడలో భవనం లేక పురాతన రేకుల షెడ్డులో కార్యాలయం నిర్వహిస్తున్నారు.
- కుంటాలలో తహసీల్దార్ కార్యాలయం ఎస్సీ హాస్టల్ భవనంలో కొనసాగుతుంది.
- సారంగాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయం పురాతన భవనంలో కొనసాగుతుంది.
- దిలావర్‌పూర్‌లో సొంత భవనం ఉన్నా.. గదులు ఉరుస్తున్నాయి. సౌకర్యాలు లేవు.
- తానూర్‌లో భవనం శిథిలావస్థలో ఉంది. వర్షాలతో గదులు ఉరుస్తాయి.

నూతన భవనాలు నిర్మించాలి



జిల్లాలో అనేక చోట్ల తహసీల్దార్ భవనాలు శిథిలావస్థకు చేరడంతో అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లో భయంభయంగా గడపాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. **–తిలక్‌రావు, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు**

ప్రమాదం నుంచి బయటపడ్డా



గతేడాది ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి పని నిమిత్తం వచ్చినప్పుడు పైకప్పు కూలింది. తాను పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్యాలయంలో మరమ్మతులూ చేపట్టలేదు. **– సత్యమూర్తి, ఖానాపూర్**

ప్రతిపాదనలు పంపాం

శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయాల వద్ద నూతన భవనాలు నిర్మించాలని అధికారులు పంపిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం ఆయా మండలాల్లో అదనపు గదులు నిర్మిస్తున్నారు. పలు చోట్ల వాటి నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల పూర్తవాల్సి ఉంది. **– రాంబాబు, అదనపు కలెక్టర్, నిర్మల్**

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: నెలవారి మరమ్మతుల నేపథ్యంలో నిర్మల్ పట్టణంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 11గంటల వరకు బుధవార్‌పేట్, పాతబస్టాండ్, కలెక్టరేట్, ఇందిరానగర్, శాస్త్రీనగర్, ప్రియదర్శినినగర్, మైత్రినగర్, భాగ్యనగర్, బాగులవాడ, బర్కత్‌పుర, చిక్కడపల్లి, పాన్‌గల్లీ, చైన్‌గేట్, గొల్లపేట్, విజయనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖానాపూర్: మండలం నుంచి పెంబి వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్నందున పలు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని సత్తన్‌పల్లి, పాతఎల్లాపూర్, బీర్నందితోపాటు పెంబి, లింగాపూర్ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాని కోరారు.

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద, మల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

సారంగాపూర్: మండలంలోని చించోలి(బి), జామ్, కౌట్ల(బి), స్వర్ణ గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ తెలిపారు. విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

నిల్వ నీటితో రోగాల ముప్పు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో శుక్రవారం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. రోడ్డు పక్కన, ఇళ్ల పరిసరాలను పరిశీలించి నీరు నిల్వ లేకుండా లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. వైద్యాధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ నిల్వనీటితో రోగాల ముప్పు పొంచి ఉందన్నారు. సిబ్బంది సుగుణ తదితరులు ఉన్నారు.

విఠాపూర్‌లో..

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈసందర్భంగా నీటి కుళాయిలు, పాత టైర్లలో ఉన్న నీటిని పారబోయించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ గల్లపురం లక్ష్మీరమేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్ రాధ, కారోబారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

భూమిపూజ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ శ్రీ మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. పండితుడు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, మహాలక్ష్మి మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎలిశెట్టి లింగేశ్వర్, సతీశ్‌రావు దేశ్‌పాండే, మైలారపు గంగాధర్, నాయిని సంతోశ్, జన్నారపు శంకర్, గుమ్ముల రాజేందర్, అయిందల జనార్దన్, బుక వెంకటేశ్వర్లు, భీమేశ్వర్, శ్రీనివాస్, రవీకాంత్, భూమన్న, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

16న వీరన్న వర్ధంతి సభ

ఖానాపూర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 16న నిర్వహించే మారోజు వీరన్న 24వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పసుపుల వెంకన్న కోరారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూలే, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా వీరన్న కమ్యూనిస్టులను ఏకం చేసి ఎన్నో ఉద్యమాలు చేసి.. అమరత్వం పొందాడన్నారు. అనంతరం మే 23న నిజామాబాద్‌లో వర్ధంతి సభ జరుగుతుందన్నారు.

రూ.50 వేల విరాళం



విరాళం అందిస్తున్న మాజీ ఎంపీ రమేశ్

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో హిందూ జనశక్తి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించే ఛత్రపతి శివాజీ విగ్రహం కోసం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ శుక్రవారం రూ.50వేల విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాజులకే ఆదర్శంగా నిలిచి సువిశాల మరాఠ సామ్రాజ్యాన్ని నెలకొల్పిన ఘనుడు శివాజీ అని కొనియాడారు. కమిటీ సభ్యులతోపాటు వెంకట్రాములు, తోకల బుచ్చన్న, మహేందర్, గుడాల రాజన్న, కిషన్, రవీందర్, లింబాద్రి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీ–సాయినగర్ తండా గ్రామంలో శ్రీ సంత్ జగద్గురు రామ్‌రావ్ మహారాజ్ విగ్రహాన్ని శుక్రవారం శ్రీ దీక్ష గురుప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మూఢ నమ్మకాలు నమ్మకుండా ప్రకృతిని ప్రేమించాలన్నారు. జెడ్పీటీసీ చిన్న రామయ్య, అంజనీ–సాయినగర్ తండా సర్పంచ్ జాదవ్ అంజనాబాయి, ఉపసర్పంచ్ అంబర్‌సింగ్, గంగారెడ్డి, శ్రీనివాస్, భూమేశ్ పాల్గొన్నారు.

‘పల్లెపల్లెకు బీజేపీ’

తానూరు: ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని బీజేపీ నాయకులు మోహన్‌రావ్ పటేల్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని దాగాం, హంగిర్గా గ్రామంలో పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. తానూరు మండలంలో ఇప్పటి వరకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి కనీస వసతులు కల్పించలేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అధికారంలోకి వస్తే పల్లెల్లో సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం బీజేపీ జెండా ఆవిష్కరించి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుభాశ్‌పటేల్, జ్ఞానేశ్వర్, రమేశ్ పటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ అనుమతిపై మంత్రి హర్షం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లో వైద్య కళాశాల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతిపై రాష్ట్ర మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకు కేటాయించిన మెడికల్ కళాశాలలో 100 మెడికల్ సీట్ల ప్రవేశానికి అనుమతి లభించిందని 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఎంబీబీఎస్ తరగతుల ప్రారంభం అవుతాయన్నారు. కాలేజ్ మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు, ప్రత్యేక చొరవ చూపిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆయన కతజ్ఞతలు తెలిపారు.

హామీలు నెరవేర్చాలని నిరసన



లోకేశ్వరంలో సమ్మె చేస్తున్న వీఆర్‌ఏలు

లోకేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వీఆర్‌ఏల సంఘం మండలాధ్యక్షుడు మల్కాపూరం గంగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒకరోజు నిరవధిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా కోఆర్డినేటర్ జలేందర్, సులోచన, శ్రీనివాస్, శంతన్, గంగాధర్, భోజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కన్వీనర్ సాయన్న మాట్లాడారు. వీఆర్‌ఏలకు పేస్కేల్, పదోన్నతులు, వారసత్వ ఉద్యోగాలు అమలు చేయలేదన్నారు. సంఘం మండల ఉపాధ్యక్షులు ముత్తన్న, కార్యదర్శులు, వినోద్, దేవిదాస్, సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆదాయం పెంచుకోవాలి



లింబా(కే)లో కంపోస్టు పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: పంచాయతీలు ఆదాయ మార్గాలు పెంచుకోవాలని ప్రత్యేకాధికారి మసార్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లింబా(కే), లింబా(బి) గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠదామం, నర్సరీ, అంగన్‌వాడీ, పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసుకోవాలన్నారు. అనంతరం కుంటాల ఆదర్శ పాఠశాలలో ఈనెల 15 నుంచి నిర్వహించే సీఎం కప్ పోటీల కోసం మైదానం పరిశీలించారు. వారి వెంట సర్పంచ్‌లు మోరె ఆనంద్‌రావుపటేల్, మల్లేశ్, ఎంపీవో రహీం, కార్యదర్శులు ఉత్తం, రాజబాపు , శ్రీకాంత్ తదితరులున్నారు.

పోలీసుల దిష్టిబొమ్మ దహనం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసుల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా జిల్లా కన్వీనర్ కైరీ శశిధర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసుల దాడికి నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న చింతకాయల ఝాన్సీని పోలీసులు అరెస్ట్ చేసి లేడి కానిస్టేబుళ్లు తన్నడంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురైందన్నారు. ఇలాంటి దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో ఇందుర్ విభాగ్ (స్టూడెంట్ ఫర్ సేవ) కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, నగర కార్యదర్శి జశ్వంత్, సంజయ్, యోగేశ్, రాజేశ్, సాయినాథ్ పాల్గొన్నారు.

బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో బీరప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సాగుతున్నాయి. శుక్రవారం బబ్రు మహారాజ్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ బీరప్ప విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులతో కలిసి పూజలు చేశారు.

ఉద్యోగులుగా గుర్తించాలి

భైంసారూరల్: సమస్యల పరిష్కారానికి జేపీఎస్‌లు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు విమర్శించారు. శుక్రవారం భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జేపీఎస్‌ల సమ్మెను సందర్శించి మాట్లాడారు. డా.రామకృష్ణాగౌడ్, శ్రీనివాసరాజు, నాగ్‌నాథ్, లక్ష్మణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ జరిపించండి

భైంసారూరల్: తమ గ్రామంలో ఉపాధి పనులపై విచారణ జరిపించాలని కోరుతూ మండలంలోని టాక్లి గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కల్పనజాదవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో కొన్ని నెలలుగా ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. క్రమం తప్పకుండా పనికి వెళ్లేవారికి సరైన వేతనాలు అందడం లేదన్నారు. హాజరు వేసే సిబ్బంది పనులకు రాని వారి పేరిట డబ్బులు జమ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని కోరారు. కొడిం బా, మోటేరావు, గంగాధర్, యశ్వంత్, బాలాజీ, మనోహర్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుడి అంత్యక్రియలు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బైరి నరేశ్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, బీఆర్‌ఎస్ నాయకులు సత్యనారాయణ గౌడ్.. నరేశ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకుముందు నరేశ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. రాజేందర్ యాదవ్, ఈటెల శ్రీనివాస్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సర్పంచ్ చెన్న మహేశ్ ప్రారంభించారు. నిర్వాహకులు గోస్కుల భూమయ్య, భాస్కర్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షులు రమేశ్, విజయ్‌కుమార్, శ్రీను, శేఖర్, తైమూర్ పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో పాల్గొనాలి

లోకేశ్వరం: అర్హులందరూ క్రీడా పోటీల్లో పాల్గొనాలని మండల ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్రీడామైదానం, నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈనెల 15 నిర్వహించే క్రీడల కోసం మైదానంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలన్నారు. వారి వెంట ఎంపీడీవో సల్మాన్‌రాజ్, సెక్రెటరీ రాఘవేందర్ పాల్గొన్నారు.

తానూరు: ఈనెల 15 నుంచి మండల స్థాయి సీఎం కప్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మైదానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ టోర్నీలో మండలంలోని ఆయా గ్రామాల జట్లు పాల్గొంటాయన్నారు. వారి వెంట ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఖానాపూర్: మండలంలోని అడవిసారంగాపూర్‌లో భూసార పరీక్షలపై రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డ్రీమ్స్ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్నయ్య మాట్లాడారు. భూసార పరీక్షలపై రైతులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఎరువుల వాడకంలో అదనపు ఖర్చులు తగ్గించి భూసారం కాపాడుకుంటూ దిగుబడులు పొందవచ్చన్నారు. రైతులు భూసారపరీక్షలు చేయించడం ద్వారా నేలలోని పోషకాలకు అనుగుణంగా పంటలకు ఎరువులను అందించాల్సి ఉంటుందన్నారు. సంధ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘బాధ్యులపై చర్యలు తీసుకోవాలి’

నిర్మల్: జగిత్యాలలో మైనార్టీ యువతిని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడిన ఎస్సై అనిల్‌తో పాటు బస్సు డ్రైవర్, కండక్టర్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలాంగుణామ్ సొసైటీ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం డీఆర్‌ఓ లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్, ఉపాధ్యక్షుడు మజహర్, ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్, మహ్మద్‌బిన్ అలీ తదితరులు పాల్గొన్నారు.



ఎండలు బాబోయ్ ఎండలు



రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలో మూడ్రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీలుగా నమోదవుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. బస్టాండ్ ప్రాంతం వెలవెలబోతోంది. అంబలి కేంద్రాలు, చలివేంద్రాల వద్ద జనం క్యూ కడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

గండాలను తొలగించే గండిపోచమ్మ..

- కొండల్లో కొలువుదీరిన పోచమ్మతల్లి
- నేడు ఆలయ 16వ వార్షికోత్సవం



గర్భగుడిలో పోచమ్మతల్లి

కడెం: ఉమ్మడి జిల్లావాసుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న పోచమ్మతల్లి కడెం మండలంలో ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామ సమీపంలో కొలువుదీరింది. తమను కష్టాల్లోంచి బయట పడేయాలని మొక్కిన వారి గండాలను తొలగిస్తూ ‘గండి పోచమ్మగా’ ప్రసిద్ధి చెందింది. గండి పోచమ్మ ఆలయ 16వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర ఇది..

కడెం మండలం చిట్టచివరన.. కవ్వాల్ టైగర్‌జోన్‌లో దట్టమైన అడవిలో సుమారు రెండు వేల ఏళ్ల కిందట ఓ చెట్టు కింద పోచమ్మతల్లి వెలసిందని చరిత్రకారులు చెబుతున్నారు. కడెం, జన్నారం వైపు నుంచి ఉట్నూర్ వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం పక్కనే రాంపూర్–బీర్సాయిపేట్ గ్రామాల మధ్య కడెం నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో గండి పోచమ్మ ఆలయం ఉంది.

గండాలను తొలగించే పోచమ్మ..

కడెం, జన్నారం నుంచి ఉట్నూర్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ ఆలయానికి ఉమ్మడి జిల్లా నుంచి కాక హైదరాబాద్, కరీంనగర్, తదితర ప్రాంతాల భక్తులు వస్తుంటారు. ఈదారి గుండా రాకపోకలు సాగించే వాహనదారులు సైతం ఈ ఆలయం వద్ద ఆగి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతి ఆదివారం, మంగళవారం, గురువారాల్లో ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. ముడుపులు కట్టి మొక్కుకుంటే కోరికలు నేరవేరుతాయని ప్రజల విశ్వాసం.

20 ఏళ్ల కిందట

ఉట్నూర్ మండలానికి చెందిన రామగిరి కిష్టయ్య ఇరవై ఏళ్ల కిందట తీవ్ర అనారోగ్యం బారిన పడ్డాడు. చావుబతుకుల మధ్య ఉన్న కిష్టయ్యను కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా పోచమ్మతల్లికి మొక్కుకున్నాడు. కిష్టయ్య ఆరోగ్యం వారం రోజుల్లో నయమైంది. తన ప్రాణాలు కాపాడిన పోచమ్మతల్లికి జీవితాంతం సేవ చేయాలని తలచి దాతల సహకారంతో 2004లో ఆలయ నిర్మాణం ప్రారంభించి.. 2007 మే13న విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. కరీంనగర్‌కు చెందిన మాజీ జీసీసీ ఉద్యోగి మేకల బోంద్యాలు విగ్రహం అందించగా, మరికొందరు దాతలు విరాళాలు అందించి ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్నారు. అప్పటి నుంచి రామగిరి కిష్టయ్య పోచమ్మ ఆలయ పూజారిగా సేవ చేస్తున్నాడు.

కోర్కెలను తీరుస్తుంది

గండి పోచమ్మతల్లి భక్తుల కోరికలను తీరుస్తుంది. కష్టం వచ్చిన వారికి అండగా ఉండి వారిని గండాల నుంచి గట్టెక్కిస్తుంది. శుక్రవారం నిర్వహించే ఆలయ వార్షికోత్సవానికి భక్తులు భారీగా తరలిరావాలి.

– రామగిరి కిష్టయ్య, ఆలయ పూజారి

తాగి నడుపొద్దు

ముథోల్: మద్యం తాగి వాహనాలను నడుపవద్దని ముథోల్ ఎస్సై సాయికిరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. వేగంతో ప్రయాణించడం, తాగి నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.